క్లుప్తంగా...

దొంగతనాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

శంషాబాద్ రూరల్: గ్రామస్తులు దొంగతనాల నివారణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఎండాకాలంలో ఎక్కువగా దొంగతనాలు జరుగుతాయని తెలిపారు. ఎవరైనా తాళం వేసి ఊరికి వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డబ్బులు, బంగారాన్ని ఇనుప బీరువాలో పెట్టకుండా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. మహిళలు చైన్ స్నాచింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా సమాచారం ఉంటే 100కి కాల్ చేయాలన్నారు. గుర్తు తెలియని వారు ఫోన్ చేసి అడిగితే వ్యక్తిగత సమాచారం చెప్పవద్దన్నారు.

ఫొటోఫినా ఎగ్జిబిషన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే



ఫొటో, వీడియోగ్రఫీల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అడ్రస్ కన్వెన్షన్‌లో జరుగుతున్న ఫొటోఫినా ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులు, పెరుగుతున్న టెక్నాలజీని ఆయన అడిగి తెలుసుకున్నారు. తాము జీవించటంతో పాటు మరో పది మందికి ఉపాధిని కల్పిస్తూ వినియోగదారులకు మరచిపోలేని మధురానుభూతులను ఫొటోగ్రాఫర్‌లు అందిస్తారన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులపై ..

- వెస్ట్ జోనల్ కమిషనర్‌తో సమావేశమైన ట్రాఫిక్ పోలీసులు



గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలపై శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్యతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చర్చించారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో సమావేశమై పలు సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ నుంచి యశోద హాస్పిటల్ నుంచి సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తీసుకొస్తే కూకట్‌పల్లి నుంచి వచ్చే ట్రాఫిక్‌కు ఇబ్బందులు తొలుగుతాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. లెమన్ ట్రీ హోటల్, సైబర్ గేట్ వే , అవాసా హోటల్ వద్ద ర్యాంపులను తొలగించాలని తెలిపారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ ఉన్న రోడ్లలో వీధి దీపాలు వెలగకపోవడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అలాగే రోడ్ల వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించాలని కోరగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ హన్మంతరావు, సీఐలు నర్సింహ, శ్రీనాథ్, సుమన్ పాల్గొన్నారు.

టీకాపై మరింత అవగాహన అవసరం

- హెచ్‌సీయూ ప్రొఫెసర్, ప్రముఖ ఇమ్యునాలజిస్ట్ శర్మిష్ట బెనర్జీ

రాయదుర్గం: టీకా ప్రాముఖ్యత అందరికీ తెలుసని కానీ దీనిపై మరింత అవగాహన కల్పించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రముఖ ఇమ్యునాలజిస్ట్ శర్మిష్ట బెనర్జీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ర్సిటీ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రోగనిరోధక శాస్త్ర దినోత్సవాన్ని ఇండియన్ ఇమ్యునాలజీ సొసైటీ, న్యూఢిల్లీ ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్)తో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోగనిరోధక వ్యవ స్థను పెంచుకోవడానికి తమవంతు కృషి చేయాలని సూచించారు. 'మనూ' ఓఎస్‌డీ-2 ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోగ నిరోధక శక్తి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పర్వీన్ జహాన్, ప్రొ.సల్మాన్ అహ్మద్‌ఖాన్, రాజ్యశ్రీ, డా.ఆరిఫ్ అహ్మద్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

సుల్తాన్‌బజార్: యువతకు ఉచిత ఉపాధి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఐసీఐసీఐ ఫౌండేషన్ ట్రైనర్ పాలెపల్లి వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఐసీఐసీఐ అకాడమీనందు ఉచిత ఎయిర్ కండీషన్ రిపేయిర్, రిఫ్రిజిరేటర్ సర్వీసింగ్‌లో ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల లోపు యువతకు ఇంటర్, డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, అనంతరం ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 93933 45451లో సంప్రదించవచ్చు.

24 గంటల్లో కటకటాల్లోకి..

చోరీ చేసిన నిందితులను అరెస్ట్‌చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి ఇంట్లోని రెండు సేఫ్ లాకర్లతో సహా ఎత్తుకుపోయిన ఇద్దరు పాత నేరస్తులను 24 గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ నెక్నాంపూర్ అల్కాపురి టౌన్‌షిప్ రోడ్ నంబర్ 27కు చెందిన విక్రమ్‌రావు తన కుటుంబసభ్యులతో కలిసి 15 రోజుల క్రితం నార్త్ ఇండియా టూర్‌కు వెళ్లాడు. ఇంట్లోని బంగారు, వెండి ఆభరణాలను అల్మారాలోని లాకర్‌లో భద్రపరిచి వెళ్లారు. 27న ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు పుప్పాలగూడలోని అతడి సోదరుడు లక్ష్మణ్‌రావుకు సమాచారం అందించారు. లక్ష్మణ్‌రావు ఘటన స్థలానికి చేరుకోని దొంగతనం జరిగిందని భావించి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విక్రమ్‌రావు ఇంట్లో అధునాతన వైఫై సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ టూర్‌కు వెళ్తుండడంతో వాటిని స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో పోలీసులు ప్రధాన రహదారులు, సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. దీంతో పాటు ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుల చిట్టాను తీశారు. 26న రాత్రి విక్రమ్‌రావు ఇంటి ప్రహరీని దూకి ఇద్దరు నిందితులు రెండు లాకర్‌లను తమ యాక్టివా వాహనంపై తీసుకువెళ్తూ సీసీ కెమెరాలో చిక్కారు. సీసీఎస్ పోలీసులతో పాటు నార్సింగి క్రైమ్ పోలీసులు వారి వివరాలను సేకరించారు. నారాయణపేట్ మక్తల్ మండలం చిన్నపోర్ల గ్రామానికి చెందిన చేపల అంజప్ప(24) అలియాస్ అంజలప్ప, యాకత్‌పురాకు చెందిన సోహెల్ అలీ(20) అలియాస్ స్టాండర్‌గా గుర్తించారు. సోహెల్ అలీపై నగరంలోని 8 పోలీస్ స్టేషన్లలో 14 కేసులు నమోదై ఉన్నాయి. కాలాపత్తర్ పోలీసులు 2021లో పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు తరలించారు. 2022 ఏప్రిల్‌లో జైలు నుంచి విడుదలై 15 రోజుల్లోనే ద్విచక్ర వాహనం దొంగలించి జైలుకు వెళ్లాడు. ఈ సమయంలో జైలులో అంజలప్పతో పరిచయం ఏర్పడింది. అంజలప్పపై నగరంలోని నాలుగు పోలీస్‌స్టేషన్‌లలో ఆరు కేసులు నమోదైయ్యాయి. ఇరువురు యాక్టివా ద్విచక్ర వాహనంపై అల్కాపూర్‌లో రెండు రోజుల పాటు రెక్కి నిర్వహించారు. ప్రధాన రహదారి చౌరస్తాపై విక్రమ్‌రావు ఇల్లు ఉండడం అదీ తాళం వేసి ఉండడంతో చోరీకి పాల్పడ్డారు. బీరువాలో రెండు లాకర్లు ఉండడంతో వాటిని తెరిచేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. రెండు లాకర్లను బయటకు తీసుకువచ్చి ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లారు. ఇందుకు సంబంధించిన పూర్తి దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. నార్సింగి ప్రాంతంలో ఇరువురు ఉన్నట్లు సమాచారం అందడంతో సీసీఎస్ పోలీసులు, నార్సింగి పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకోని 16 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి ఆభరణాలు, యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లో నిందితులను పట్టుకున్న సీసీఎస్, నార్సింగి పోలీసులను డీసీపీ అభినందించి రివార్డులు అందించారు. ఇద్దరు నిందితులపై పీడీయాక్టు కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తున్నట్లు డీసీపీ వెల్లడించారు. ఈ విలేకర్ల సమావేశంలో అదనపు డీసీపీ రేష్మిపేరుమళ, నార్సింగి ఏసీపీ రమణాగౌడ్, క్రైమ్ ఏసీపీ శంకర్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ తదితరులున్నారు.

కొత్వాల్‌గూడ వెళ్లాలంటే భయం.. భయం!

- పంచవటి పార్కు వద్ద వాహనదారులపై విరుచుకుపడ్డ దుండగులు
- ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసిన కొత్వాల్‌గూడ వాసులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణానికి రెండు కిలో మీటర్ల దూరంలోనే ఉన్న పంచవటి పార్కు వద్ద గుర్తుతెలియని దుండగులు విరుచుకుపడుతున్న తీరు కొత్వాల్‌గూడ వాసుల్లో భయాందోళన కలిగిస్తోంది. వారం రోజులుగా రాత్రి 10 గంటల తర్వాత కొత్వాల్‌గూడ వెళ్తున్న వాహనదారులపై ఎయిర్‌పోర్టు కాలనీ దాటిన తర్వాత పంచవటి పార్కు వద్ద గుర్తుతెలియని కొందరు వ్యక్తులు దాడులకు పాల్పడ్డారు. ఎయిర్‌పోర్టులో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి దాడులు చేయడంతో పాటు ఫోన్, డబ్బులు లాక్కున్నట్లు సమాచారం. ఇదే తరహాలో మరికొందరు వాహనదారులపై దాడులు జరిగాయి. కొందరు వారి బారి నుంచి తప్పించుకుని స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండు రోజుల కిందట ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నప్పటికీ దాడులకు పాల్పడింది వారేనా..? కాదా ..? పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దుండగుల చర్యలతో రాత్రి కాగానే కొత్వాల్‌గూడకు వెళ్లే ప్రయాణికులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎయిర్‌పోర్టు కాలనీ నుంచి కొత్వాల్‌గూడ వరకు పూర్తి స్థాయిలో వీధి దీపాలను అమర్చడంతో పాటు పోలీసుల గస్తీని ముమ్మరం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మతోన్మాద ప్రభుత్వాన్ని గద్దె దించుదాం



మాట్లాడుతున్న నాయకులు

రాజేంద్రనగర్: కేంద్రంలోని మనువాద మతోన్మాద ప్రభుత్వాన్ని గద్దె దించుదామని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. మోదీ హఠావో దేశ్‌కో బచావో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం రాజేంద్రనగర్ మండల పరిధిలోని స్వప్న థియేటర్ సర్కిల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీని గద్దె దించకపోతే భారత ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ.. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు దారదత్తాం చేస్తున్నాడన్నారు. ఈ సభకు సీపీఐ నియోజకవర్గ కో కన్వీనర్ వనంపల్లి జైపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సయ్యద్ అఫ్సర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ఏ.రియాజ్, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి, గండిపేట మండల కార్యదర్శి బాబురావు, సీపీఐ రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి విజయనంద్‌గౌడ్, శంకరయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సభ్యులు ఆనంద్‌గౌడ్, రాజు, నిరంజన్, ఆనంద్, సత్యం, శ్రీహరి పాల్గొన్నారు.

కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

రాజేంద్రనగర్: కార్మికులు తమ హక్కులను సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జి.ఎం.కురుమయ్య అన్నారు. శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘం శివరాంపల్లి కమిటీ గడ్డి యాదయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జి.ఎం.కురుమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడే అంటే కార్మికులకు కనీస హక్కులు వచ్చిన రోజు అని అన్నారు. ప్రతి రంగంలో పని చేస్తున్న కార్మికులు మేడే వారోత్సవాల్లో పాల్గొని మేడేను ఘనంగా జరుపుకోవాలన్నారు. ప్రస్తుత పాలకులు ఉన్న హక్కులను కాలరాస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులు అనేక పోరాటాల ఫలితంగా 1996లో సంక్షేమ చట్టం, సంక్షేమ బోర్డు సాధించుకుంటే దానిలో జమైన డబ్బులు కార్మికుల కోసమే ఖర్చు పెట్టాలని ఉన్నా ఆ డబ్బును కార్మికుల కోసమే ఖర్చు చేయాలని సుప్రీంకోర్టు చెప్పినా పెడచెవిన పెడుతూ కార్మికులకు డబ్బులు నకిలీ డెత్ సర్టిఫికెట్లు పుట్టించి దొడ్డిదారిన దళారులు మింగి వేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి రేఖనాయక్, కమిటీ ఉపాధ్యక్షులు నాగిరెడ్డి, కె.శంకర్, ఎం.శంకర్, సహాయ కార్యదర్శులు ఆకుల యాదయ్య, అంజయ్య, బుగ్గయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

కారు పల్టీ.. ఇద్దరికి గాయాలు



రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్ సర్వీస్ రోడ్డుపై నుంచి అదుపుతప్పిన ఓ కారు ఈసీకాలువలోకి పల్టీ కొట్టింది. హిమాయత్‌సాగర్ సర్వీస్ రోడ్డు గుండా శుక్రవారం ఉదయం నగరానికి చెందిన ఇద్దరు తమ కారులో వెళ్తున్నారు. సర్వీస్ రోడ్డు ఈసీ కాలువ వద్దకు రాగానే అదుపుతప్పి సర్వీస్ రోడ్డుపై నుంచి కాలువలోకి కారు పల్టీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ పోలీసులు వెల్లడించారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై కేసు

రాజేంద్రనగర్: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. గోల్డెన్ హైట్స్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా భార్యాభర్తలు పని చేస్తున్నారు. వీరికి 14 ఏళ్ల బాలిక ఉంది. ఇదే ప్రాంతానికి చెందిన సలామ్ అనే యువకుడు మాయమాటలు చెప్పి స్థానికంగా నిర్మానుష ప్రదేశానికి తీసుకువెళ్లి గురువారం లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై బాలిక తల్లికి తెలపడంతో శుక్రవారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫైనాన్స్ వాయిదాలపై వాగ్వాదం.. కత్తితో దాడి

రాజేంద్రనగర్: కారు ఫైనాన్స్ విషయమై మాటామాటా పెరిగి కత్తితో దాడికి పాల్పడ్డ ఘటన అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ఘటనలో గాయపడ్డ ఫైనాన్సియర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. సిక్‌చౌనీ ప్రాంతానికి చెందిన కృపాల్‌సింగ్(50) ఓ మాజీ ఎమ్మెల్యే వద్ద బాడీగార్డు. ఇదే ప్రాంతానికి చెందిన ఉత్తమ్‌సింగ్(32) వాహనాలకు ఫైనాన్స్‌ను ఇస్తుంటాడు. కృపాల్‌సింగ్ తన స్నేహితుడికి ఉత్తమ్‌సింగ్ వద్ద ఫైనాన్స్‌పై కారును కొనుగోలు చేయించాడు. ఫైనాన్స్ వాయిదాలను చెల్లించకపోవడంతో వన్‌టైం సెటిల్‌మెంట్ విషయమై సంప్రదింపులు జరుపుతున్నారు. ఇదే విషయమై ఉత్తమ్‌సింగ్ శుక్రవారం ఉదయం కృపాల్‌సింగ్ వద్దకు వచ్చి వాయిదాల విషయమై మాట్లాడుతున్నారు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. కృపాల్‌సింగ్ కత్తితో ఉత్తమ్‌సింగ్‌పై దాడి చేయడంతో చేతి, కడుపులో గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కత్తిపోట్లకు గురైన ఉత్తమ్‌సింగ్‌ను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల పెంపకంలో లింగ వివక్ష చూపవద్దు



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ జయమ్మ, సర్పంచ్ వెంకటయ్య

శంషాబాద్ రూరల్: పెద్దతూప్ర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. పిల్లల పెంపకంలో లింగ వివక్షత చూపించవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి సూచించారు. ప్రతి ఆడపిల్ల ఓ లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ముందుకు సాగాలన్నారు. ఆడపిల్లలు అన్నింట్లో ముందుండాలన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని ఎంపీపీ జయమ్మ సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వెంకటయ్య, ఏఎన్‌ఎం రజని, ఆశా వర్కర్లు అరుణ, కరుణ పాల్గొన్నారు.

పైప్‌లైన్‌లు వేయండి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో గతంలో వేసిన 4 అంగులాల నీటి పైప్‌లు ఏమాత్రం సరిపోవటం లేదని వాటిని 6 అంగులాలకు పెంచాలని జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డిని మణికొండ మున్సిపాలిటీ నాయకులు కోరారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్ పి.శైలజ, మాజీ సర్పంచ్ జైహింద్‌రావు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 16వ వార్డు పరిధిలో పేదలు నివసిస్తున్న వీకర్‌సెక్షన్ కాలనీ, మధ్య తరగతి వారు నివసిస్తున్న ఎంప్లాయీస్ కాలనీలు ఉన్నాయన్నారు. వాటికి దశాబ్దాల క్రితం పైప్‌లైన్‌లు వేశారని, వాటిని నేటి పరిస్థితులకు అనుగుణంగా సామర్థ్యం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, భాను, నరేష్ యాదవ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సీబీఐటీలో వ్యవసాయ ప్రదర్శన



వ్యవసాయ యంత్రాలను ప్రదర్శిస్తున్న రైతులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో శుక్రవారం ఏసీఐసీ-సీబీఐటీ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక పరికరాల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధునికంగా వ్యవసాయాన్ని అగ్రగామిగా మార్చడానికి అవసరమైన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. నూతన సాంకేతిక, ఆధునిక వ్యవసాయాన్ని అవలంబించాలనే ఆసక్తి ఉన్న రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వ్యవసాయ యాంత్రీకరణ నుంచి ఆరోగ్య, సాంకేంతికత మొదలైన 40 ప్రదర్శనలను రైతులకు వివరించారు. అందులో కొబ్బరి బొండాల క్రషింగ్ యంత్రం, వెల్లుల్లి, ఉల్లిపాయలు, వేరుశెనగ పొట్టు తొలగించే యంత్రం, గాలి ద్వారా కరెంటు ఉత్పత్తి యంత్రం, సోలార్ రిక్షా, అధునాతన వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రవీందర్‌రెడ్డి, పీఆర్‌ఓ డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ దర్గాలో నూతన కమ్యూనిటీహాల్ పనులను శుక్రవారం కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. యువత, మహిళలు, సీనియర్ సిటిజన్లకు ఉపయోగపడేలా నూతన కమ్యూనిటీహాళ్లను నిర్మిస్తున్నామన్నారు. వీటిల్లో సభలు, సమావేశాలు నిర్వహించుకునేలా వీలు కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ ఇంజినీర్ సంజీవ్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో గండిపేట మండల రేషన్ డీలర్లు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని గండిపేట మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం హైదర్షాకోట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. డీలర్లందరికీ గౌరవ వేతనం అందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డీలర్లు అన్ని సంఘాలు జేఏసీగా ఏర్పడి ఒక్కటిగా పోరాడాలని పిలుపునిచ్చారు. తమ డిమాండ్ల సాధన కోసం కలిసి కట్టుగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి హేమ, ఉపాధ్యక్షులు డి.సుమన్ కుమార్, కార్యదర్శి నాగన్న, కోశాధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ఘనంగా స్పోర్ట్స్ డే



క్రీడా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న వాలీబాల్ క్రీడాకారిణి శ్రీకృతి

మణికొండ: గండిపేటలోని మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో వార్షికోత్సవ సందడి నిర్వాణ-2023లో భాగంగా శుక్రవారం రెండో రోజు స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రోజంతా బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, స్టాఫ్ అంత్యాక్షరి షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్, మోనో యాక్ట్, వాయిస్ హంట్ పాటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన అకాడమిక్, క్రీడా దినోత్సవం వేడుకల్లో ముఖ్యఅతిథిగా జేఎన్‌టీయూ హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ ఇవాల్యుయేషన్ ప్రొఫెసర్ కె. వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినపుడే జీవితంలో రాణిస్తారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన అంతర్జాతీయ వాలీబాల్ ప్లేయర్ కుమారి శ్రీకృతి మాట్లాడుతూ.. గెలుపుతో సంబంధం లేకుండా వాటిని సమానంగా చూస్తూ విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా వారు విద్య, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, స్టూడెంట్ అసోసియేషన్ సెక్రటరీ అనంత్‌లు విద్యార్థుల ప్రగతిపై ప్రసంగించారు.

వర్టికల్స్‌లో సైబరాబాద్‌కు టాప్ ప్లేస్

పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వర్టికల్స్‌లో మొదటి స్థానంలో నిలిచిందని కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన పోలీసు సిబ్బందికి శుక్రవారం ప్రశంసాపత్రాలు, రివార్డులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో కూడా 22 ఫంక్షనల్ వర్టికల్స్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, 17 ఫంక్షనల్ వర్టికల్స్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. మొదటి స్థానంలో ఉన్నామంటే మరింత బాధ్యతతో పనిచేయాలన్నారు. ఫంక్షనల్ వర్టికల్స్‌లో వరుసగా టాప్ ప్లేస్‌లో ఉండేందుకు కృషి చేస్తున్న ఏసీపీ శివభాస్కర్‌ను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ డీసీపీ కల్మేశ్వర్ ,ఏసీపీ శివభాస్కర్, రవీందర్, ఇన్‌స్పెక్టర్లు యాదగిరి, వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. శుక్రవారం సాయంత్రం క్యాంపస్‌లోని ప్రొఫెసర్ గురుభక్ష్‌సింగ్ మైదానంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన హెచ్‌సీయూ ప్రొవీసీ ప్రొఫెసర్ ఆర్‌ఎస్ సర్రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన వివిధ విభాగాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులను అందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సిటీ నేచర్ చాలెంజ్‌లో హైదరాబాద్

గచ్చిబౌలి: సిటీ నేచర్ చాలెంజ్‌లో హైదరాబాద్‌ను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని మాజీ అటవీ ప్రధాన సంరక్షణ అధికారి పి.రఘువీర్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్, పాలపిట్ట పార్కు, నైట్ సఫారీలో మొక్కలు, జంతువులు, పక్షుల ఛాయా చిత్రాలను కెమెరాలలో బంధించారని తెలిపారు. నేచరలిస్ట్ వాలంటీర్స్, బర్డ్ వాకర్స్, గార్డెన్ వాకర్స్, అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు 1600 ఛాయా చిత్రాలను 'ఐ నేచరలిస్ట్'లో అప్‌లోడ్ చేశారని చెప్పారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఎం.జె.అక్బర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.స్కైలాబ్, ఎకో టూరిజం మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, బొటానిస్ట్ డాక్టర్ వీర కిశోర్ తదితరులు పాల్గొన్నారు.